క్లుప్తంగా

నేడు మంత్రి, జెడ్పీ చైర్‌పర్సన్ పర్యటన

మహేశ్వరం: మండల పరిధిలో శుక్రవారం మంత్రి సబితారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి పర్యటించనున్నారని ఇన్‌చార్జి ఎంపీపీ సునీతానాయక్ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సిరిగిరిపురం గేటు వద్ద బీఆర్.అంబేద్కర్–జగ్జీవన్ రామ్ భవన్ నిర్మాణాలకు, శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో అభివృద్ధి పనులకు, రూ.8కోట్ల నిధులతో చేపట్టనున్న అమీర్‌పేట్–కోళ్లపడకల్ పీడబ్ల్యూడీ రోడ్డు వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలకు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: మరమ్మతుల కారణంగా 11కేవీ ఫీడర్ పరిధిలో అష్టలక్ష్మి ఫీడర్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని గురువారం సరూర్‌నగర్ డివిజనల్ ఇంజినీర్ కె.రామకృష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఈ అంతరాయం ఉంటుందన్నారు.

30 పడకల ఆస్పత్రి మంజూరు

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీకి 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ)ని మంజూరు చేస్తూ వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆరోగ్య తెలంగాణలో భాగంగా పేదల చెంతకు వైద్యం అందించడమే లక్ష్యంగా ఇటీవలే కందుకూరులో మెడికల్ కళాశాలకు శంకుస్థాపన చేశారు. మహేశ్వరం సీహెచ్‌సీని 30 నుంచి 50 పడకలుగా అప్‌గ్రేడ్ చేశారు. తాజాగా జల్‌పల్లి మున్సిపాలిటీకి ఆసుపత్రి మంజూరు చేయడంతో మంత్రి సబితా ఇంద్రారెడ్డి, సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



కాంగ్రెస్‌లో చేరుతున్న యువత

బడంగ్‌పేట్: మహేశ్వరం నియోజకవర్గం నుంచి పలువురు యువకులు బాలాపూర్‌లోని బడంగ్‌పేట్ కార్పొరేషన్ మేయర్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిగురింత పారిజాత నివాసంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి వచ్చేంది కాంగ్రెస్ పార్టీయే అన్నారు. ఈ కార్యక్రమంలో బడంగ్‌పేట నగర పంచాయితీ మాజీ వైస్ చైర్మన్ నర్సింహారెడ్డి, కార్పొరేటర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి తదితరులున్నారు.

15 నుంచి ప్రత్యంగిరా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురంలోని కుర్తాళం పీఠం వారాహి సమేత ప్రత్యంగిరా పరమేశ్వరి దేవీ శరన్నవరాత్రులు ఈనెల 15 నుంచి 23 వరకు జరుగుతాయని ఆలయ సెక్రటరీ మునిపల్లె శ్రీనివాస్ తెలిపారు. గురువారం ఆర్‌కేపురంలో ప్రత్యంగిరా పరమేశ్వరి ఆలయంలో దసరా నవరాత్రుల కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిరోజూ ఉదయం అమ్మవారికి విశేష 18 రకాల ద్రవ్యాలతో అభిషేకం, మహిళలచే కుంకుమార్చన, సాయంత్రం విశేష అలంకారం, భక్తి సంగీతం, మహా నక్షత్ర హారతులు, ప్రసాద వితరణ జరుగుతాయని తెలిపారు. దేవీ శరన్నవరాత్రులలో అమ్మవారి ప్రత్యేక అలంకరణ దర్శనములు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విట్టల్ శర్మ, సాయికుమార్ శర్మ, మునిపల్లె సువర్ణలత, అరుణ, హేమ, శ్రీపతి శర్మ, ఉదయ్ కుమార్, లావణ్య పాల్గొన్నారు.

చట్ట సభల్లో బీసీలకు సముచిత స్థానం కల్పించాలి

ఎల్‌బీనగర్: తెలంగాణలో బీసీలు ఎక్కువ సంఖ్యలో ఉన్న నియోజకవర్గాల్లో స్థానిక బీసీలకే ఎమ్మెల్యే టికెట్లు కేటాయించాలని తెలంగాణ బీసీ కులాల సమన్వయ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మ రఘురామ్ నేత డిమాండ్ చేశారు. గురువారం బీఎన్‌రెడ్డి డివిజన్ ఎస్‌కేడీ నగర్ కాలనీ సంక్షేమ సంఘ భవనంలో ఏర్పాటు చేసిన సమన్వయ వేదిక సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా రఘురామ్ మాట్లాడుతూ.. తెలంగాణలోని కొన్ని నియోజకవర్గాలలో 70శాతం ఓటర్లు బీసీ కులస్తులే ఉన్నప్పటికీ పలు పార్టీల నేతలు అగ్ర కులస్తులకే ఎమ్మెల్యే టికెట్లు కేటాయించటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో వేదిక సభ్యులు రాజు, రామరాజు, రమేష్, జగన్నాధం, ఆనంద్ పాల్గొన్నారు.

క్రీడల్లో నైపుణ్యం సాధించాలి

ఎంపీపీ కమ్లీమోత్యానాయక్

కడ్తాల్: యువత చదువుతో పాటు, క్రీడల్లో నైపుణ్యాన్ని సాధించి, లక్ష్యాలను చేరుకోవాలని ఎంపీపీ కమ్లీ మోత్యానాయక్ ఆకాంక్షించారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఆయా గ్రామాల కార్యదర్శులకు, సర్పంచ్‌లకు ఎంపీపీ క్రీడా కిట్లు పంపిణీ చేశారు.

పంజా విసురుతున్న డెంగీ

- ఆస్పత్రులకు పరుగులు.. ఆందోళనలో బస్తీవాసులు
- సరూర్‌నగర్‌లో పెరుగుతున్న కేసులు



హుడాకాంప్లెక్స్: ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలకు తోడు పారిశుద్ధ్య లోపంతో బస్తీల్లో డెంగీ దోమలు విజృంభిస్తున్నాయి. నియోజకవర్గ పరిధిలోని సరూర్‌నగర్, హుడా కాలనీ, అంబేడ్కర్‌నగర్, భగత్‌సింగ్‌నగర్, గాయిత్రి నగర్, బడంగ్‌పేట్, మీర్‌పేట్, తదితర ప్రాంతాల్లో డెంగీ దోమలు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ప్రస్తుతం బస్తీల్లోని ఏ ఇంట్లోకి తొంగి చూసినా జ్వరపీడితులే కన్పిస్తున్నారు. చికిత్స కోసం సరూర్‌నగర్ ఆరోగ్య కేంద్రానికి పరుగులు తీస్తున్నారు. ఫలితంగా ఆస్పత్రి ఓపీ రోజు రోజుకు మరింత పెరుగుతోంది. సాధారణ జ్వరపీడితులతో పాటు డెంగీ బాధితులు ఉంటున్నారు.

13 కేసులు నమోదు

ఆస్పత్రిలో జనవరి నుంచి ఆగస్టు వరకు ఏడు డెంగీ పాజిటివ్ కేసులు నమోదు కాగా.. సెప్టెంబర్‌లో ఆరు కేసులు రిపోర్ట్ అయితే.. అక్టోబర్‌లో కేవలం ఐదు రోజుల్లోనే రెండు కేసులు నమోదు కావడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతుంది. ప్రభుత్వం ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాలు లేకపోవడంతో రోగులు సమీపంలోని ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. వైద్యులు సాధారణ జ్వరపీడితులకు డెంగీ జ్వరాలను బూచీగా చూపించి, చికిత్సలు, వైద్య పరీక్షల పేరుతో రూ.లక్షలు గుంజుతున్నారు. ప్లేట్‌లెట్ కౌంట్స్, ఐసీయూ చికిత్సలకు భారీగా ఛార్జీ చేస్తున్నా. వాటిని పట్టించుకునే నాథుడు కరువయ్యాడని పలువురు చర్చించుకుంటున్నారు.

దోమలకు నిలయాలు

ఇటీవల కురిసిన ఏకధాటి వర్షాలకు లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయమయ్యాయి. ఇళ్ల మధ్య రోజుల తరబడి నీరు నిల్వ ఉండటంతో వాటిలో డెంగీ కారక దోమలు వృద్ధి చెందుతున్నాయి. వీటితో పాటు ఇంటి ఇంటి ఆవరణలోని పూల కుండీలు, వాటర్ ట్యాంకులు, ఇంటిపై ఉన్న టైర్లు, ఖాళీ కొబ్బరి బొండాలు, ప్లాస్టిక్ డబ్బాలు, నూతన భవనాలు, వాటి సెల్లార్లు డెంగీ కారక దోమలకు నిలయంగా మారుతున్నాయి. ఎప్పటికప్పుడు ఆయా ప్రాంతాలను శుభ్రం చేసుకోవడం, నిల్వ ఉన్న నీటిని తొలగించడం, చెట్ల పొదలను శుభ్రం చేసుకోవడం, సాయంత్రం వేళలో ఫాగింగ్ నిర్వహించడం ద్వారా దోమలను నియంత్రించొచ్చు.

లక్షణాలు

- ఈడిస్ ఈజిప్టై(టైగర్ దోమ) కుట్టడం ద్వారా డెంగీ సోకుతుంది.
- పగటి పూట మాత్రమే కుట్టే ఈ దోమ.. ప్రస్తుతం లైటింగ్ ఎక్కువగా ఉండటంతో రాత్రిపూట సైతం కుడుతుంది.
- దోమ కుట్టిన 7 నుంచి 8 రోజులకు హఠాత్తుగా తీవ్రమైన జ్వరం రావడంతో పాటు కాళ్లు కదలించలేని పరిస్థితి ఉంటుంది.
- ఎముకలు, కండరాల్లో భరించ లేని నొప్పి, శరీరంపై ఎర్రటి పొక్కులు వస్తాయి.
- డెంగీ బాధితుల్లో రక్త కణాలు(ప్లేట్స్ లెట్స్) సంఖ్య 40 వేలలోపు పడిపోతుంది.
- 20 వేలలోపు పడిపోతే..ప్రమాదం. ఆ సమయంలో తిరిగి ఎక్కించాల్సి ఉంటుంది.
- లేదంటే అవయవాలన్నీ పనిచేయడం మానేసి, మృత్యువాతపడే ప్రమాదం ఉంది.
- లక్షణాలు గుర్తించి వెంటనే చికిత్స తీసుకోవడం వల్ల డెంగీ నుంచి బయటపడొచ్చు.

పిల్లలు జాగ్రత్త

- డెంగీ దోములు పిల్లలపై ఎక్కువగా దాడీ చేస్తున్నాయి.
- సాధ్యమైనంత వరకు కాళ్లు, చేతులు పూర్తిగా కప్పి ఉంచే దుస్తులు వేయాలి.
- పిల్లలు పగలు నిద్ర పోయే సమయంలో పడకపై రక్షణ కోసం దోమ తెరలు వాడాలి.
- మస్కిటో మ్యాట్, మస్కిటో కాయిల్స్, ఆల్ అవుట్ వంటివాటితో దోమల నియంత్రించాలి.
- ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా పారిశుద్ధ్యలోపం లేకుండా చూసుకోవాలి.
- పాఠశాల ఆవరణతో పాటు ఆ చుట్టూ పక్కల పరిసరాల్లో పారిశుద్ధ్యలోపం లేకుండా చూడాలి.
- ఫాగింగ్, యాంటీ లార్వ చర్యల ద్వారా ఎప్పటికప్పుడు దోమలను నియంత్రించాలి.
- ఇంట్లోని మంచినీటి ట్యాంకులపై మూతలు పెట్టడం ద్వారా డెంగీ దోమలను దరికి చేరకుండా చూడొచ్చు.

కానిస్టేబుళ్లుగా ఎంపికైన వారికి సత్కారం



ఇర్విన్‌లో యువకులను సత్కరిస్తున్న శంకర్

ఆమనగల్లు: ఆమనగల్లు, మాడ్గుల మండలాలలోని పలు గ్రామాలకు చెందిన యువకులు పోలీసు కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు. మాడ్గుల మండలం ఇర్విన్ గ్రామంలో కానిస్టేబుల్‌గా ఎంపికైన నవీన్, మధుకర్‌రెడ్డి, రషీద్‌బాబ, జూనియర్ లైన్‌మెన్‌గా ఎంపికైన నరేశ్‌లను యువజన సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర నాయకుడు, జిల్లా దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు శంకర్ ఆధ్వర్యంలో సత్కరించారు. వితాయిపల్లి గ్రామానికి చెందిన సాయికుమార్‌ను ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింహా ఆధ్వర్యంలో సత్కరించారు. చంద్రాయణపల్లి తండాలో కానిస్టేబుళ్లుగా ఎంపికైన కల్యాణ్, నరేశ్‌రాథోడ్, వినోద్, వినీశ్, నరేశ్, పాండులను కాంగ్రెస్ నాయకులు శ్రీధర్‌నాయక్, సిద్ధు, మురళి, రవి ఆధ్వర్యంలో సత్కరించారు. ఆమనగల్లులోని స్నేహహస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత శిక్షణ శిబిరంలో శిక్షణ పొందిన వారిలో 10 మంది కానిస్టేబుళ్లుగా ఎంపికైనట్లు ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, నల్గొండ జిల్లా విజిలెన్స్ సీఐ చరమందరాజు, ప్రధాన కార్యదర్శి యాదయ్య తెలిపారు. ఆమనగల్లుకు చెందిన ఆమని, మల్లిక, డయానా, సతీశ్, శివ, మహేశ్, రవీందర్, శివ, జంగారెడ్డిపల్లికి చెందిన మహేశ్, మల్లేశ్ ఎంపికైనట్లు వారు వివరించారు.

రిటైర్డ్ పోలీస్ మృతి

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల గ్రామంలో రిటైర్డ్ పోలీస్ ఉద్యోగి ప్రభాకర్‌రెడ్డి (76) అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతి చెందారు. మృతుడు రాష్ట్ర డీజీపీ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేశారు. ప్రభాకర్‌రెడ్డి మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు. మృతుడికి కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు.

నిబంధనల ఉల్లంఘన

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించి, మద్యం సేవించి, డ్రైవింగ్ లైసెన్స్‌లు లేకుండా వాహనాలు నడిపిన 15 మందిపై ఇన్‌స్పెక్టర్ కిరణ్ ఆధ్వర్యంలో గురువారం చార్జిషీట్లను నమోదు చేశారు. రాజేంద్రనగర్ మూడవ స్పెషల్ ఎంఎం కోర్టు న్యాయమూర్తి నలుగురికి జైలు శిక్ష, మిగిలిన 11 మందికి అపరాధ రుసుం విధించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ... మద్యం సేవించి వాహనాలను నడపొద్దన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తప్పనిసరిగా వాహన యజమాని జైలుకు వెళ్లాల్సి ఉంటుందన్నారు.

కేటీఆర్‌కు పెయింటింగ్ బహూకరణ

ఆమనగల్లు: మంత్రి కేటీఆర్‌కు ఆమనగల్లు మండలం చింతలపల్లి గ్రామానికి చెందిన చిత్రకారుడు, బీఆర్ఎస్ నాయకుడు వెంకట్‌రెడ్డి గీసిన పెయింటింగ్‌ను కేటీఆర్‌కు బహూకరించారు. షాద్‌నగర్‌లో జరిగిన బహిరంగ సభలో మంత్రిని కలిసిన ఆయన తాను గీసిన చిత్రపటాన్ని అందజేశారు.

పదోన్నతులు, బదిలీలు చేపట్టాలి

ఎస్‌జీటీయూ జిల్లా అధ్యక్షుడు మణిపాల్‌రెడ్డి

ఆమనగల్లు: ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు వెంటనే చేపట్టాలని సెకండరీ గ్రేడ్ టీచర్స్ యూనియన్ (ఎస్‌జీటీయూ) జిల్లా అధ్యక్షుడు మణిపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ కార్యాలయం ఎదుట గురువారం ఎస్‌జీటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మణిపాల్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీలో ప్రకటించిన విధంగా ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుల పోస్టులను వెంటనే మంజూరు చేయాలని కోరారు. సీపీఎస్ రద్దు చేయాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అప్‌గ్రేడ్ చేసిన బాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయ పోస్టుల పదోన్నతులలో హైకోర్టు తీర్పును అమలు చేయాలన్నారు. ఎస్‌జీటీలకు ప్రమోషన్లు ఇవ్వకుండా బదిలీలు చేపట్టడం వల్ల సీనియర్ ఉపాధ్యాయులకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీటీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి అంజయ్య, జిల్లా కార్యదర్శి పాండు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యం.. శిథిలావస్థలో గ్రంథాలయం



వనస్థలిపురం ఎన్జీఓస్ కాలనీలోని శాఖా గ్రంథాలయం

- శిథిలావస్థకు చేరిన వనస్థలిపురం గ్రంథాలయం
- పట్టించుకోని అధికారులు

వనస్థలిపురం: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు. విద్యార్థులు మొదలు సీనియర్ సిటిజెన్స్ వరకు జ్ఞాన సముపార్జనకు గ్రంథాలయాలకు వస్తుంటారు. అలాంటి గ్రంథాలయాలకు పాఠకుల ఆదరణ మెండుగా ఉన్నా నిర్వహణ లోపం, శిథిల భవనాలు, సరైన సౌకర్యాలు లేక పలు గ్రంథాలయాలు మూత పడుతుండగా, మరికొన్ని చోట్ల ఏదో నామమాత్రంగా నడుస్తున్నాయి. ప్రతి సంవత్సరం నవంబరు 14 నుంచి 20వ తేదీ వరకు దేశవ్యాప్తంగా జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహిస్తున్నా తదనంతరం గ్రంథాలయాలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయి.

అధ్వాన్నస్థితిలో వనస్థలిపురం శాఖా గ్రంథాలయం..

వనస్థలిపురం ఎన్జీవోస్‌కాలనీలో ఉన్న శాఖా గ్రంథాలయంకు ప్రజల ఆదరణ మెండుగా ఉన్నా సరైన వసతులు లేకపోవడంతో పాఠకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ గ్రంథాలయంకు వనస్థలిపురం, పరిసర 60 కాలనీల ప్రజలు వస్తుంటారు. 1991లో ఎన్జీవోస్‌కాలనీ సంక్షేమ సంఘం సమకూర్చిన రేకుల షెడ్డులోనే ప్రస్తుతం గ్రంథాలయం నడుస్తోంది. అయితే రేకుల షెడ్డు శిథిలావస్థకు చేరుకోవడంతో వర్షాకాలం కురుస్తు విలువైన గ్రంథాలు పాడయిపోతున్నాయి. గ్రంథాలయంకు తాగునీరు, టాయిలెట్ల సౌకర్యం, సరైన సిబ్బంది లేరు. గ్రంథాలయం భవనం కోసం హైదరాబాద్ సిటీ ఎంప్లాయీస్ కోఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ ఎన్జీవోస్ కాలనీలో 400 గజాల స్థలం కేటాయించి ఏళ్లు గడుస్తున్నా వివిధ కారణాలతో భవనం నిర్మాణానికి నోచుకోలేదు.



పగుళ్ల మయంగా మారిన గ్రంథాలయం రేకుల కప్పు

స్థలం ఉన్నా.. నిర్మించని భవనం

ప్రస్తుతం గ్రంథాలయం ఉన్న రేకులషెడ్డు శిథిలావస్థకు చేరుకోవడంతో కొన్ని ఏళ్ల క్రితమే గ్రంథాలయం కోసం హైదరాబాద్ సిటీ ఎంప్లాయీస్ కోఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ ఎన్జీవోస్‌కాలనీలో 400 గజాల స్థలం కేటాయించింది. స్థలం ఇచ్చినా గ్రంథాలయ పాలకవర్గం భవన నిర్మాణానికి పూనుకోవడం లేదు.

– సోమయాజులు, కార్యదర్శి, ఎన్జీవోస్ కాలనీ సంక్షేమ సంఘం

త్వరలోనే భవన నిర్మాణ పనులు చేపడతాం

గ్రంథాలయం భవన నిర్మాణం కోసం హైదరాబాద్ సిటీ ఎంప్లాయీస్ కోఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ వారు ఎన్జీవోస్‌కాలనీలో స్థలం కేటాయించిన సంగతి నిజమే. భవన నిర్మాణం కోసం రూ.2 కోట్ల నిధులను జిల్లా గ్రంథాలయ సంస్థ కేటాయించింది. భవన నిర్మాణానికి కావాల్సిన అనుమతులు వచ్చాయి. స్థానిక ఎమ్మెల్యే, మంత్రి సహకారంతో త్వరలోనే భవన నిర్మాణం పనులు చేపడతాం.

– సత్తు వెంకటరమణారెడ్డి, చైర్మన్, రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ

డిమాండ్లను నెరవేర్చండి



ఆశ వర్కర్ కవితను పరామర్శిస్తున్న చల్లా నర్సింహారెడ్డి

మీర్‌పేట: ఆశ వర్కర్ల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మహేశ్వరం నియోజకవర్గ కేంద్రంలో నిరసన కార్యక్రమంలో భాగంగా మంత్రికి వినతిపత్రం ఇచ్చేందుకు మీర్‌పేటలోని క్యాంపు కార్యాలయం వద్దకు వెళ్తున్న క్రమంలో ఆశావర్కర్ కవిత స్పృహ కోల్పోగా చికిత్స నిమిత్తం ఆమెను ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న నర్సింహారెడ్డి కాంగ్రెస్ నాయకులతో కలిసి గురువారం సిర్లాహిల్స్‌లోని కవిత నివాసానికి వెళ్లి ఆమెను పరామర్శించారు. ఆశ వర్కర్ల విషయంలో వెంటనే విద్యాశాఖ మంత్రి స్పందించి వారి డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించేలా చొరవ తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో దేప భాస్కర్‌రెడ్డి, మీర్‌పేట అధ్యక్షుడు సామిడి గోపాల్‌రెడ్డి, పద్మశ్రీ, బండి మధుసూదన్, ధన్‌రాజ్‌గౌడ్, సిద్ధుచారి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే పేదలకు మేలు

పహాడీషరీఫ్: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ జెండా ఎగురేస్తామని డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీలోని 3వ వార్డు నబీల్ కాలనీలో మున్సిపాలిటీ అధ్యక్షుడు అహ్మద్ బామ్ ఆధ్వర్యంలో విజయభేరి సభలో ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను గురువారం ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. పీసీసీ కార్యదర్శి యెల్మేటి అమరేందర్‌రెడ్డితో కలిసి 'మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, యువ వికాసం, చేయూత పథకాలను వివరించారు. ఈ సందర్భంగా వారు కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దేప భాస్కర్ రెడ్డి, బండి మధుసూదన్ రావు, నల్లెంకి ధన్‌రాజ్ గౌడ్, బాల్‌రెడ్డి, మన్నె రవికుమార్, యూసుఫ్ ఖాద్రీ, ఫాసిల్ ఖాద్రీ, ఖాదర్ పాల్గొన్నారు.

ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం



పారిజాతరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న యువకులు

- పీసీసీ ప్రధాన కార్యదర్శి చిగురింత పారిజాత రెడ్డి

మహేశ్వరం: వచ్చే ఎన్నికల్లో మహేశ్వరం గడ్డపైన కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని పీసీసీ ప్రధాన కార్యదర్శి చిగురింత పారిజాత నర్సింహారెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని మన్సాన్‌పల్లి గ్రామానికి చెందిన యువకులు కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు ఏర్పుల శ్రీశైలం ఆధ్వర్యంలో పారిజాత నర్సింహారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు నచ్చక కాంగ్రెస్‌లో స్వచ్ఛందంగా పలువురు చేరుతున్నారన్నారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం కాంగ్రెస్ నిరంతరం కృషి చేస్తుందన్నారు. రాష్ట్రంలో బీజేపీ, బీఆర్ఎస్ రెండు ఒక్కటే అన్నారు. పార్టీలో చేరిన వారికి కాంగ్రెస్ కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో అల్వాల్ మహేశ్ గౌడ్, భాస్కర్, రఘు, భాస్కర్ గౌడ్, సోమేష్ గౌడ్ పలువురు పాల్గొన్నారు. ఫొటో ఫ్రేమ్‌ను చిగురింత దంపతులకు బహూకరించారు. ఈ కార్యక్రమంలో బడంగ్‌పేట్ నగరపంచాయతీ మాజీ వైస్ చైర్మన్ చిగురింత నర్సింహారెడ్డి, కాంగ్రెస్ నాయకులు శ్రీశైలం, గణేశ్, రామయ్య, శేఖర్, విఠల్, మహిపాల్, యాదయ్య పలువురు పాల్గొన్నారు.

గ్రూప్ వన్ ప్రిలిమ్స్ రద్దుకు నిరసనగా ర్యాలీ



ర్యాలీగా వస్తున్న ఏబీవీపీ విద్యార్థులు

శంషాబాద్: గ్రూప్ వన్ ప్రిలిమ్స్ రద్దుపై రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని ఏబీవీపీ డిమాండ్ చేసింది. ఈ మేరకు పట్టణంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో వందలాది మంది విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. పరీక్షల నిర్వహణలో విఫలమవుతున్న ప్రభుత్వం అధికారులతో పాటు మంత్రులు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. గత తొమ్మిదేళ్లలో ఏ పరీక్షలను కూడా ప్రభుత్వం సక్రమంగా నిర్వహించలేదన్నారు. మద్యం నోటిఫికేషన్‌లను మాత్రం సక్రమంగా చేపడుతుందన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ చాకలి మహేష్, ప్రదీప్, అఖిల్, చరన్, చందు, భారత్, భార్గవ్, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బొడ్రాయి ఉత్సవాలు



పూజలు చేస్తున్న భక్తులు

కడ్తాల్: మండల పరిధిలోని కానుగుబావితండాలో ఆంజనేయచార్యుల ఆధ్వర్యంలో గురువారం బొడ్రాయి ఉత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వేద పండితులు, గ్రామస్తులు హోమ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పాల్గొని పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. శుక్రవారం బొడ్రాయి ప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించనున్నట్లు తండా పెద్దలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇళ్లు లేని పేదలకు ప్రభుత్వ స్థలాలివ్వండి



మాట్లాడుతున్న గోపాల్

దిల్‌సుఖ్‌నగర్: మహేశ్వరం నియోజకవర్గంలోని ఇళ్లు లేని పేదలందరికీ సీఎం కేసీఆర్ ప్రభుత్వ స్థలాలు కేటాయించాలని భారత సాంస్కృతిక సహకార స్నేహ సంఘం (ఇస్కఫ్) రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.గోపాల్ విజ్ఞప్తి చేశారు. గురువారం ఆర్‌కేపురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్‌లోని తెలంగాణ ఫంక్షన్ హాల్‌లో ఇస్కఫ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సీపీఐ భగత్ సింగ్‌నగర్ ఫేజ్–2 కార్యదర్శి పాపయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ.. సొంతింటి కల అనేది ప్రతి ఒక్కరికీ ఉంటుందన్నారు. ఆ కలను నెరవేర్చుకోవాలంటే మనమంతా కలిసికట్టుగా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని చెప్పారు. ఇప్పటికే ఈ విషయమై మంత్రి సబితాఇంద్రారెడ్డికి వినతిపత్రం అందజేశానని తెలిపారు. దీనిపై తమ సహకారం ఉంటుందని మంత్రి హామీనిచ్చారని వెల్లడించారు. సీపీఐ భగత్‌సింగ్‌నగర్ శాఖ ఫేజ్–1 కార్యదర్శి మహమూద్ మహబూబ్ మాట్లాడుతూ.. ప్రస్తుతం డబుల్ బెడ్ రూంలు నిర్మించే సమయం లేదని ప్రభుత్వం గ్రహించి.. వెంటనే ఇళ్లు లేని పేద కుటుంబాలకు స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. సీపీఐ ఎన్టీఆర్ నగర్ కార్యదర్శి మహ్మద్ ఇస్మాయిల్, ఎన్టీఆర్‌నగర్ ముఖ్య నాయకులు మున్నాబాయ్, షకీల్, యాదయ్య, సయ్యద్ ఇస్మాయిల్, ఎండీ ఇస్మాయిల్, ఇన్సాఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మునీర్ పటేల్, సీపీఐ సీనియర్ నాయకుడు జాహెద్, సీపీఐ నగర కార్యవర్గసభ్యుడు ఎస్ఎ మన్నన్ పాల్గొన్నారు.